ప్రజాశక్తి
శనివారం 10 డిసెంబర్ 2022 5 అనంతపురం





సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

విభేదాలను వీడుదాం

- మళ్లీ అధికారమే లక్ష్యంగా పనిచేయాలి
- చంద్రబాబు ఎక్కడ పోటీ చేసినా ఓటమే
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

అధికార పార్టీ అన్న తరువాత విభేదాలు సహజమని, వీటిని ఎక్కడికక్కడే పరిష్కరించుకుని ముందుకు సాగి వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసిపి గెలిచేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గాల సమీక్షలో భాగంగా శుక్రవారం నాడు ఆయన జిల్లాకు విచ్చేశారు. ఇందులో భాగంగా కళ్యాణదుర్గం నేతలతో సమీక్షను నిర్వహించారు. కళ్యాణదుర్గం పట్టణంలోని స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఎంపీ తలారి రంగయ్య, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, జెడ్పీ ఛైర్మన్ గిరిజమ్మ, నియోజకవర్గ స్థాయి వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చారని వెల్లడించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల నుంచి తొలత వ్యతిరేకత ఉండడం సహజమే అన్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు, గ్రామ సచివాలయ సేవలు అందించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచంలోనే ఆదర్శంగా ఉందన్నారు. పార్టీ అభివృద్ధికోసం నిరంతరం కృషిచేస్తున్న కార్యకర్తలకు భవిష్యత్తులో సముచితస్థానం లభిస్తోందన్న భరోసా ఇచ్చారు. ఇక మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎక్కడ పోటీ చేసినా ఆయనకు ఓటమి తప్పదన్నారు. కుప్పంలో గెలవలేక ఆయన కళ్యాణదుర్గంలో పోటీ చేస్తారనే వార్తలు వస్తున్నాయని, ఇక్కడ పోటీ చేసిన ఆయనకు ఓటమి తప్పదన్నారు. చంద్రబాబు నాయుడు 650 హామీలు ఇచ్చి అధికారంలో వచ్చాక వాటిలో ఎన్ని హామీలు నెరవేర్చారన్నది ప్రజలే సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజల్లో ప్రచారం చేసి వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్‌లో

ఛార్జిషీట్ దాఖలు

- జెసిపిఆర్, అస్మిత్‌రెడ్డితోపాటు 12 మందిపై అభియోగాలు నమోదు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

బిఎస్-3 వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్‌లో మరో కదలిక వచ్చింది. తప్పుడు పత్రాలతో బిఎస్-3 వాహనాలను బిఎస్-4 రిజిస్ట్రేషన్ చేసారన్న ఆరోపణలున్నాయి. దీనిపై ఇది వరకే అనంతపురం, తాడిపత్రి పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో తాడిపత్రి పోలీసులు 830 పేజీలతో ఛార్జిషీట్‌ను శుక్రవారం నాడు తాడిపత్రి జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో తాడిపత్రి పోలీసులు దాఖలు చేశారు. ఇందులో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆయన తనయుడు అస్మిత్‌రెడ్డి, ఆయన అనుయాయుడు జఠాధర సంస్థ ప్రతినిధి సి.గోపాల్‌రెడ్డితోపాటు 12 మందిపై అభియోగాలను మోపుతూ అందజేశారు. బిఎస్-3 వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి మొత్తం 35 కేసులు నమోదై ఉన్నాయి. ఇందులో నిందితులుగానున్న వారందరి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులను చెన్నైలోనున్న అశోక్ లైల్యాండ్ సంస్థకు లావాదేవీలు సాగినట్టు పోలీసులు ఛార్జిషిట్‌లో పేర్కొన్నారు. ఛార్జిషీట్‌లో దాఖలుతో ఈ కేసు విచారణలో పురోగతి వేగవంతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 151 వాహనాలను నిబంధనలకు తుక్కు కింద కొనుగోలు చేసి, వాటిని బిఎస్-4గా రిజిస్ట్రేషన్ చేసారన్న ఆరోపణలపై గతంలోనే జెసి.ప్రభాకర్‌రెడ్డి, జెసి.అస్మిత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డిలపై కేసులు నమోదై ఉన్నాయి. వీరు ఈ కేసుల్లో జైలుకు సైతం వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చి ఉన్నారు. ఇప్పుడు ఈ కేసులో జరిగిన అవతవకలపై కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ కూడా దృష్టిసారించింది. కార్పొరేట్ సంస్థ అయిన అశోక్ ల్యాలెండ్ సంస్థ ప్రమేయంపైనా దర్యాప్తు సంస్థ విచారణ చేపడతామని కొద్ది రోజుల క్రితమే ప్రకటించియుంది. ఈ నేపథ్యంలో తాడిపత్రిలో విచారణ చేపట్టిన పోలీసులు ఛార్జిషీట్‌ను దాఖలు చేయడం చర్చనీయాంశమైంది. ఇంకా అనంతపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లోనూ దీనిపై విచారణ సాగుతోంది. ఈ విచారణలో ఎటువంటి అంశాలు వెలుగులోకి వస్తాయన్నది చూడాల్సి ఉంది.

ఐదు వాహనాలు తుక్కు కింద విక్రయం

అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగిన వాహనాలను సీజ్ చేశారు. ఈ వాహనాలను కొనుగోలు చేసిన వారు తాము ఆర్థికంగా నష్టపోతామని తమకు ఈ వాహనాలను తుక్కు కింద అమ్ముకుని అయినా కొంత వరకు ఆర్థిక నష్టాన్ని పూడ్చుకుంటామని ఐదుగురు వ్యక్తులు న్యాయస్థానాన్ని కోరారు. ఈ ఐదు వాహనాలను విక్రయించుకోవడానికి న్యాయస్థానం అనుమతినిచ్చింది. దర్యాప్తు సంస్థల సమక్షంలోనే చేయాలని న్యాయస్థానం సూచన మేరకు పోలీసు అధికారులు, రవాణా అధికారులు సంయుక్తంగా ఈ పనిని ఇటీవలనే పూర్తి చేశారు. ఇక దర్యాప్తు కూడా వేగవంతమై ఛార్జిషీట్ కూడా దాఖలవడంతో కేసు విచారణ మరింత వేగవంతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్ కేసులు అటు రాష్ట్రాన్నే కాకుండా దేశాన్ని కుదిపేశాయి. ఇప్పుడు ఈ కేసు విచారణ, చర్యలు ఏ రకంగా ఉంటాయని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇది మరెన్ని మలుపులు తిరగనుందోనని అందరూ ఎదురు చూస్తున్నారు.

నిర్లక్ష్యం చేస్తే ఇళ్లకు పంపుతాం

నిర్మాణ పనుల్లో వేగం పెరగాలి
కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందజేసే కీలక బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందని, ఈ బాధ్యతను మరిచి నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిని ఇళ్లకు పంపుతామంటూ కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం ఉదయం గుంతకల్లు పట్టణంలోని పరిటాల శ్రీరాములు కల్యాణ మండపంలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు, నాడు-నేడు విద్య, ప్రభుత్వ భవనాల నిర్మాణాలపై అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌తో కలిసి డివిజనల్ స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు, నాడు-నేడు పనులు, గ్రామ సచివాలయ భవనాలు, ఆర్‌బికెలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు క్షేత్ర స్థాయిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అమెనిటీస్ సెక్రెటరీలు కషి చేయాలన్నారు. బాధ్యతలను గుర్తించకుండా, విధులను నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెలాఖరులోగా మంజూరైన ప్రతి ఒక్క ఇల్లూ గ్రౌండింగ్ చేయించాలన్నారు. లబ్ధిదారులకు రుణాలు ఇప్పించి నిర్మాణాలు చేపట్టేలా చైతన్య పరచాలన్నారు. డిసెంబరు నాటికి నాడు-నేడు పనులకు సంబంధించి వంద శాతం రివాల్వింగ్ ఫండును ఖర్చు చేసి సివిల్ వర్కులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జె.రవీంద్ర, ఆన్సెట్ సీఈవో కేశవ నాయుడు, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, మున్సిపల్ కమిషనర్ శేషన్న, మునిసిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవాని, గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

12 మందికి నోటీసులు

ఆయా గ్రామాల పరిధిలోని నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహించిన 12 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, నలుగురు అమెనిటీస్ సెక్రెటరీలకు కలెక్టర్ నోటీసులు ఇచ్చారు. నోటీసులు తీసుకున్న సచివాలయ ఉద్యోగులు రెండువారాల్లోగా పనితీరు మెరుగుపరుచుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

జెఎన్‌టియు డిప్యూటీ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం



బాధ్యతలు స్వీకరిస్తున్న సెక్షన్ డిప్యూటీ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి

అనంతపురం జెఎన్‌టియు అకౌంట్ సెక్షన్, ఎస్టాబ్లిస్‌మెంట్ సెక్షన్ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ఎన్.మధుసూదన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ సి.శశిధర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్సిటీ పరిపాలన నిర్ణయాలను వేగవంతంగా అమలు చేసి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నూతన డిప్యూటీ రిజిస్ట్రార్‌కు జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రభాకర్ బోధన, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

చెన్నుపాటి ఆశయాలను కొనసాగిస్తాం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో నివాళి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎనలేని పోరాటం కొనసాగించిన అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయాలను కొనసాగిస్తామని యుటిఎఫ్ సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్ అన్నారు. యుటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు చెన్నుపాటి లక్ష్మయ్య వర్థంతి శుక్రవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు అధ్యక్షతన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు జిలాన్ మాట్లాడుతూ చెన్నుపాటి లక్ష్మయ్య ఆదినుంచి స్వతంత్ర భావాలు కలిగి సమాజ శ్రేయస్సు, సంఘం అభివృద్ధికి వృషి చేశారన్నారు. అంటరాని తనం, భూస్వామ్య పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా కలిసి వచ్చే వారిని కలుపుకొని పోరాటాలు నిర్వహించారని తెలిపారు. నిమ్నకులాలు వెనుకబడిన కుటుంబాల వారికి తోడ్పాటు అందించారన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు మాట్లాడుతూ బతకడమే సమస్యగా ఉన్న పరిస్థితులు నుంచి గౌరవంగా బ్రతికే స్థితికి ఉపాధ్యాయులు వచ్చారంటే నాడు చేసిన పోరాటాల ఫలితమే అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ విన్నపాల ద్వారా కాకుండా పోరాటాల ద్వారా మాత్రమే సాధించగలమని ఉపాధ్యాయులకు పోరాట మార్గం చూపిన ఆదర్శనీయుడు చెన్నుపాటి అన్నారు. చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయ సాధనకు అందరూ పునరంకితులు కావాలని, ఆయన బాటలో మనమందరం నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు సుబ్బరాయుడు, కొండప్ప, గంగాధర్, శేషప్ప తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీకి శాశ్వత భవనాలు నిర్మించాలి

విద్యార్థి సంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



విలేకరులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నేతలు పథ్వీ సురేష్

సెంట్రల్ యూనివర్శిటీకి శాశ్వత భవనాలు నిర్మించాలని విద్యార్థి సంఘాల నేతలు ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పృథ్వీ, బిసి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి బిసి.సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పేరుకు మాత్రం సెంట్రల్ యూనివర్శిటీ ఏర్పాటు చేశారని, ఇంకా పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించకపోవడం బాధాకరమన్నారు. మౌలిక వసతులు, కనీస సౌకర్యాలు, సొంత భవనం లేదన్నారు. దేశం, రాష్ట్రాల నుంచి విద్యార్థులు చదువుకోవడానికి వచ్చారని, వారికి సమస్యలే ఎదురవుతున్నాయని తెలిపారు. యూనివర్సిటీకి జంతులూరు దగ్గర భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారని, ఐదు సంవత్సరాలు కావస్తున్న శాశ్వత భవనాలు నిర్మించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీని కడపకు తరలించాలని కుట్రలకు పూనుకుందన్నారు. అందుకోసమే శాశ్వత భవనాలు నిర్మించడంలో కాలయాపన చేస్తోందన్నారు. సెంట్రల్ యూనివర్శిటీ కోసం ఐక్యంగా పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు రాజు, దిలీప్, నాగరాజు, రమేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాలల్లో మందుల కొరత

ఆందోళనలో నార్పల మండల పాడిరైతులు - మందుల కొరత వాస్తవమే : డాక్టర్ గోవిందరాజులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంతోపాటు పప్పూరులో ఉన్న పశు వైద్యశాలల్లో మందుల కొరత వేధిస్తోంది. దీంతో మండలంలోని పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. రోగాల బారిన పశువులను ఆయా పశువైద్యశాలలకు తీసుకొచ్చినప్పుడు సంబంధిత రోగాలకు చెందిన మందులను బయట తీసుకోవాలని వైద్యులు రాసి ఇస్తున్నారు. ఆర్థికంగా బాగా ఉన్న రైతులు బయట మందులు కొని తెచ్చుకుంటున్నారని, లేని రైతులు చేసేది లేక వెనక్కి వెళ్తున్నట్లు వాపోతున్నారు. ఒకటి, రెండు బర్రెలు పెట్టుకుని పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న తాము ఖరీదైన మందులను బయటినుంచి తెచ్చుకోలే సతమతమవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా పశువైద్యశాలలకు తగినన్ని మందులు సరఫరా చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశాలు జరిగినప్పుడు ప్రశ్నించడం.. అందుకు అధికారులు సమస్యను పక్కన పెట్టడం పరిపాటిగా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా పశు వైద్యశాలలను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి ఎన్ని మందులు వస్తున్నాయి.. ఎన్ని మందులు స్టాక్ ఉన్నాయి.. వైద్యులు వైద్య సిబ్బంది ఏ సమయానికి వస్తున్నారు.. ఎప్పుడు వెళ్తున్నారనే పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై నార్పల వెటర్నరీ డాక్టర్ గోవిందరాజులును వివరణ కోరగా మండల కేంద్రంలోపాటు పప్పూరు పశువైద్యశాలల్లో మందుల కొరత ఉన్న విషయం వాస్తవమే అన్నారు. తమకు అందుబాటులో ఉన్న మందులతోనే వైద్యం చేయిస్తున్నామని, తమ వద్ద లేని మందులను బయట తెచ్చువాలని చీటీలు రాసి ఇస్తున్నట్లు తెలిపారు. మందులు రాకపోతే తాము కూడా ఏమీ చేయలేమని సమాధానం ఇచ్చారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా పశువైద్యశాలలకు సరిపడ మందులు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.



నార్పలలోని పశువైద్యశాల



డ్రిప్పులు, స్ప్రింక్లర్ల పరికరాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

రైతు సమాచార కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రైతుబజార్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సాగునీటి పథకం సంచాలకుల కార్యాలయంలో డ్రిప్, స్ప్రింక్లర్లపై రైతుల అవగాహన కోసం ఏర్పాటు చేసిన రైతు సమాచార కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రైతు సమాచారం కేంద్రంలో రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లకు సబంధించి ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన అన్ని కంపెనీల విడి భాగాలు అందుబాటులో ఉంటాయన్నారు. టెలిస్కోపిక్ విధానంలో హెడ్ కంట్రోల్ యూనిట్‌లో స్క్రీన్ ఫిల్టర్, ప్రెషర్‌గౌజ్, వెంచూరి, ఎయిర్ రిలీజ్ వాల్వ్ తదితర భాగాలు బిగించే విధానం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ రైతుసమాచార కేంద్రం రైతులు, రైతు భరోసా కేంద్రం అధికారులకు డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకంపై పూర్తి సమాచారం ఇస్తుందన్నారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి ఫీరోజ్ ఖాన్ మాట్లాడుతూ రైతు సమాచారం కేంద్రాన్ని రాష్ట్రంలో ప్రథమంగా జిల్లాలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా ఉద్యాన అధికారి రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రైతు సమాచార కేంద్రం ద్వారా రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. అగ్రికల్చర్ అడ్వయిజరీ బోర్డు సభ్యులు పెద్దిరెడ్డి జైన్ కంపెనీ మెటీరియల్ ఎక్కువగా ఇవ్వాలని జెసిని కోరారు. ఈ కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఉద్యాన అధికారులు రత్న కుమార్, చందన, రైతులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాడిపత్రి డీఎస్పీ తీరు సరికాదు


మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి



కోర్టు ఆవరణలో సొమ్మసిల్లి పడిపోయిన కమలమ్మ

టిడిపి రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి కమలమ్మకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయడం ఏంటని స్వయానా అనంతపురం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి చెప్పినా తిరిగి 41ఏ కింద నోటీసులు ఇచ్చి చకచకా అరెస్టు చేయించడం వెనక డీఎస్పీ వీఎంకే చైతన్య హస్తం ఉందని జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ తాడిపత్రి వైసిపి కార్యకర్త అడ్డు బాషాపై దాడి, టిడిపి ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డిపై రాళ్ల దాడి, పరస్పర దాడుల నేపథ్యంలో పోలీసులు 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారన్నారు. ఆమెను పోలీసులు గురువారం అరెస్టు చేశారని, దీంతో అలా ఎలా అరెస్టు చేస్తారని చెప్పిన జడ్జి నిందితురాలు కమలమ్మను విడుదల చేయాలని ఆదేశించారన్నారు. ఆయనకు సంబంధించిన అన్నిరకాల బాగోతాలు బయట పెడతానని కమలమ్మ చెప్పడం వల్లే అరెస్టు చేశారని ఆరోపించారు. ఒక మహిళపై 307 సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం రాయలసీమ చరిత్రలో ఎప్పుడైనా ఉందా.. అన్నారు. తాడిపత్రిలో ఎన్నో ఏళ్లుగా ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరుగుతున్నా మహిళలపై ఎప్పుడూ కేసులు నమోదు కాలేదన్నారు. అసలే అనారోగ్యంతో ఉన్న కమలమ్మకు షుగర్, బిపి ఎక్కువ కావడంతో కోర్టు ఆవరణలోనే కుప్పకూలిపోయిందన్నారు. దళితురాలు, అసలే అనారోగ్యంతో ఉన్న మహిళ పై కక్ష సాధింపు ధోరణి అవలంభించడం డీఎస్పీకి మంచిది కాదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆయన్ను వదిలేది లేదని, న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఆస్మ, పిఇటి పవన్‌కుమార్

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

పుట్లూరు : అండర్-17 షటింగ్ బాల్ గేమ్‌లో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఆస్మ సమోదా, పిఇటి పవన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చదువుతున్న వెంకటకళ్యాణ్, స్టాండ్ బై ప్లేయర్‌గా అభిషేక్ ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మండల వ్యవసాయ సలహామండలి సమావేశం

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతవారం గ్రామస్థాయిలో నిర్వహించిన సలహా మండలి సమావేశంలో చర్చించిన అంశాలను రైతు భరోసా కేంద్రాల వారీగా చర్చించారు. ముఖ్యంగా రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద యంత్ర సామగ్రి, పురుగు మందులు, డ్రిప్పు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే డ్రిప్ పరికరాలు వివిధ కంపెనీలు సరఫరా చేయడంలో జాప్యం చేయడం గురించి జిల్లా ఉద్యాన అధికారికి తెలియజేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పెద్దిరెడ్డి ఫ్రూట్ కేర్ ఆక్టివిటీ గురించి రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకు మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ నాగలింగారెడ్డి స్పందిస్తూ ఆర్‌బికెల్లో కాంప్లెక్స్ మందుల ధరలు ఎక్కువగా ఉన్నట్లు వివరించారు. మండల వ్యవసాయ అధికారి ముస్తఫా మాట్లాడుతూ రైతులందరూ పిఎం కిసాన్ 13వ విడత కోసం ఇకెవైసి చేసుకోవాలని సూచించారు. అలాగే ఖరీఫ్2022 పంట నమోదు సంబంధించి పంట నమోదు రసీదును రైతు భరోసా కేంద్రాల్లో తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు, గ్రామ రైతులు, ఎలక్ట్రిక్ ఎఇ రఘునాథ్, పశు వైద్యాధికారి గోవిందరాజు, జిల్లా ఉద్యాన అధికారి రఘునాథ్‌రెడ్డి, వ్యవసాయ, ఉద్యాన శాఖ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ఎఒ కార్యాలయంలో చోరీ

అమడగూరు : మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు.కార్యాలయంలో ఉన్న ప్రింటర్‌ను చోరీ చేశారని వ్యవసాయ అధికారిణి వీర జోష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జిబిసికి సాగునీరు విడుదల

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలోని నింబగల్లు వద్ద గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ జీరో బై జీరో వద్ద శుక్రవారం సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, మండల కన్వీనర్ బసన్న మాట్లాడుతూ విడపనకల్ మండలం కరకముక్కల వద్ద మూడు రోజుల కింద గుంతకల్ బ్రాంచ్ కెనాలకు గండి పడటంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే అన్నారు. అయితే విషయాన్ని మండల ప్రజాప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన వెంటనే మరమ్మతులు చేసి నీరు విడుదల చేయాలని ఆదేశించడంతో నీరు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి తిప్పయ్య, రాష్ట్ర నాయకులు భరత్‌రెడ్డి, భీమిరెడ్డి, జెఇ ప్రసాద్, వర్క్ఇన్స్‌క్టర్ ప్రభుస్వామి, గాజుల చిన్న వెంకటేష్, శివన్న, గడేకల్, పొలికి, డోనేకల్ తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.



జిబిసికి నీరు విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

రైతుల నడ్డి విరుస్తున్న వైసిపి ప్రభుత్వం

తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు

ప్రజాశక్తి-శింగనమల

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధిక బారాల మోపుతూ రైతుల నడ్డి విరుస్తోందని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు విమర్శించారు. శుక్రవారం మండలంలోని కొరివిపల్లి గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. అలాగే నాసిరకం మద్యం అమ్ముతుండటంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. ఇక ఇసుక బంగారం అయిందన్నారు. మొత్తంగా రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడిందన్నారు. కనీసం వీధి లైటు వేసిన పాపానపోలేదన్నారు. పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. నిలకడలేని పాలన కొనసాగుతోందన్నారు. టిడిపి హయాంలో డ్రైవర్లు ఓనర్లుగా మారితే వైసిపి ప్రభుత్వం వచ్చాక ఓనర్లు డ్రైవర్లుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే వైసిపి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, పార్లమెంటు కోశాధికారి శ్రీనివాసులుగౌడ్, నాయకులు యం.ఆదినారాయణ, రైతు విభాగం కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి, వి.జయన్న, ఓబులయ్య, భాస్కర, రమేష్, రామాంజనేయులు, విజయ్‌కుమార్, నాగేంద్ర, నాగభూషణ, ఓబులేసు, వెంకటరమణ, నాగార్జున, రాముని, కుళ్లాయప్ప, సుబ్బరాయుడు, మైనార్టీ సెల్ పార్లమెంట్ కార్యదర్శి మహమ్మద్ గౌస్, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న టిడిపి నాయకులు

రబీలో ఈక్రాప్ నమోదు తప్పనిసరి

వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్

ప్రజాశక్తి-బెలుగుప్ప

రబీలో సాగు చేసిన పంట లకు తప్పనిసరిగా ఈక్రాప్ చేయించుకో వాలని వ్యవసాయ అధికారి పథ్వీసాగర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలానికి సంబంధించిన ఈ-క్రాప్‌ని పూర్తి చేశామన్నారు. రబీ కాలంలో వేసిన పంటలను కూడా వచ్చేవారం నుండి పంట నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే మండలం వ్యాప్తంగా ఇంకా పీఎం కిసాన్ ఇకెవైసి చేయని రైతులు 3352 మంది ఉన్నారన్నారు. త్వరగా ఆయా రైతులు రైతు భరోసా కేంద్రాలను ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. ఛైర్మన్ శ్రీనివాసులు, ఎంపిపి పెద్దన్న మాట్లాడుతూ ప్రతి రైతు విధిగా వారు వేసిన పంటను ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాజగోపాల్, సర్పంచులు, ఎంపిటిసిలు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి పథ్వీసాగర్

నేడు నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండలోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్వహించనున్న వైసిపి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ శివరాంరెడ్డి, జిల్లా అధ్యక్షులు పైలా నర్సింహయ్య హాజరవుతారని తెలిపారు. కావున నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు, వివిధ విభాగాల డైరెక్టర్లు, ఛైర్‌పర్సన్లు తప్పక హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నరసింహులు, పార్టీ పట్టణ అధ్యక్షులు బ్యాంకు ఓబులేసు, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, ఆమిద్యాల పిఎసిఎస్ ఛైర్మన్ తేజనాథ్, వైసిపి నాయకులు అశోక్‌కుమార్, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



రక్తదానం చేసిన అయ్యప్ప భక్తులను సన్మానిస్తున్న దృశ్యం

అయ్యప్ప భక్తుల రక్తదానం

ప్రజాశక్తి-కుందుర్పి

ఛేంజ్ ఫర్ సొసైటీ టీం, స్ప్రెడ్ హ్యూమానిటీ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో అయ్యప్ప స్వామి భక్తులు రక్తదా చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మారుతీశ్వరి రామ్మూర్తి మాట్లాడుతూ అన్నిదానాల్లో కెళ్ల రక్తదానం మిన్న అన్నారు. మనకు ఎనలేని సేవలు అందిస్తున్న బత్తలపల్లి, కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆసుపత్రులకు అవసరమయ్యే రక్తం అందించేందుకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఇందులో భాగంగా సుమారు 115 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఛేంజ్ ఫర్ సొసైటీ టీం మహిళా సభ్యులు కేటీ కవిత, భూలక్ష్మీ, నాగమణి, బత్తలపల్లి ఆసుపత్రి హెచ్ఒడి హరిహరినాథ్‌శర్మ, వైద్య సిబ్బంది, మాల్యవంతం రాము మిత్ర బృందం ఛేంజ్ ఫర్ సొసైటీ టీం తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరులు

ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపన

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల పరిధిలో తోపుదుర్తి గ్రామంలో ఘనంగా బొడ్రాయ ప్రతిష్టాపన శుక్రవారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా నిర్వహించిన హోమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సకల దేవతల ఆశీస్సులు గ్రామానికి ఉండాలని ఆకాంక్షించారు. త్వరలోనే గ్రామస్తులతో చర్చించి అక్కమ్మ దేవతల పరష కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులుగా సూర్యప్రకాష్, గిరి

ప్రజాశక్తి-శింగనమల

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులుగా మండలానికి చెందిన సూర్యప్రకాష్, తరిమల గిరి ఎంపికయ్యారు. ఈమేరకు అనంతపురంలోని వికె ఆదినారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించిన 30వ జిల్లా మహాసభల్లో వీరిద్దరినీ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగంపైన అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ముఖ్యంగా విద్య కాషాయీకరణను అడ్డుకుంటామన్నారు. శాస్త్రీయ విద్యను కొనసాగించేంత వరకు నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. తమకు అవకాశం ఇచ్చినందుకు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మాజీ నాయకులు రాంభూపాల్, రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, నూతన జిల్లా కార్యదర్శి పరమేష్, అధ్యక్షులు బంగి శివకి ధన్యవాదాలు తెలిపారు.



తరిమెల గిరి సూర్యప్రకాష్

పివికెకె ఐటిలో ఘనంగా స్వాగతోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

రుద్రంపేటలోని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఘనంగా స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెఎన్‌టియు రిజిస్ట్రార్ శశిధర్ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ప్రతి విద్యార్థికీ నిరంతరం జ్ఞాన సమపార్జన అవసరమన్నారు. ఇందుకోసం ఇంటర్నెట్‌ను ఒక గొప్ప అవకాశంగా భావించి ఆన్‌లైన్ ద్వారా తమ ప్రతిభాపాతవాలను మెరుగుపరుచుకోవచ్చున్నారు. నూతన సాంకేతికతను వినోదంతోపాటు తమలోని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పరీక్షలు పాసవ్వడం కోసం కాకుండా తన విద్య సమాజానికి ఏ విధంగా ఉపయోగపడుతుందో ఆకోణంలో చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారిణి సింధుర, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, పివికెకె ఐటీ ప్రిన్సిపాల్ బండి రమేష్ బాబు, ఎఒ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జెఎన్‌టియు రిజిస్ట్రార్ శశిధర్‌ను సన్మానిస్తున్న పల్లె కిశోర్

రేవంత్ గ్యాస్ట్రో లివర్ ఆసుపత్రి ప్రారంభం



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

అనంతపురం : నగరంలోని సూర్యానగర్ 80 అడుగుల రోడ్డులో నూతనంగా నిర్మించిన రేవంత్ గ్యాస్ట్రో లివర్ ఆసుపత్రిని కర్నూలు మెడికల్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ హెచ్ఒడి వెంకటరంగారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎండి డాక్టర్ సి.రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అనంతపురం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధునాతన సౌకర్యాలతో నూతన ఆసుపత్రిని ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. తమ ఆసుపత్రిలో ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, ఇఆర్‌సిపి, కడుపులో నొప్పి, గ్యాస్ట్రబుల్, తేపులు, పొట్ట ఉబ్బరం, వికారం, వాంతులు, ఆహారం అరుగుదల సమస్యలు, మలబద్ధకం, కామెర్లు, రక్త వాంతులు, పాన్ క్రియాటైటిస్, లివర్ సిరోసిస్, హైపటైటిస్, బిఅండ్‌సి మద్యం వల్ల వచ్చే లివర్ సమస్యలు జీర్ణకోశ క్యాన్సర్లు తదితర సమస్యలకు తమ ఆసుపత్రిలో ఆధునిక పద్ధతుల్లో చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి పెథాలజీ డాక్టర్ మోహన్‌రెడ్డి, ఎంఅండ్‌హెచ్ సంస్థ అధినేతలు హనుమంతురెడ్డి, మంజు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌ను కలిసిన గుత్తి మాజీ ఎంపిపి

ప్రజాశక్తి-గుత్తి

సిఎం జగన్‌ను గుత్తి మాజీ ఎంపిపి, నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కోనా మురళీధర్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. డోన్ ఎన్నికల పరిశీలకులుగా నియమించినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కోనా మురళీధర్‌రెడ్డి తెలిపారు. అనంతరం శాలువాతో సిఎంను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో డోన్ నియోజకవర్గంలో పర్యటించి పార్టీని పటిష్టం చేయాలని సిఎం సూచించినట్లు తెలిపారు.



సిఎం జగన్‌తో కోనా మురళీధర్‌రెడ్డి

నేరాలు ఘోరాలు

రైల్లో నుంచి పడి యువకుడు మృతి

గుత్తి : ప్రమాదవశాత్తు రైలులో నుంచి పడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని తొండపాడు-జక్కల చెరువు రైల్వేస్టేషన్ల మధ్య గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. జీఆర్పీ పోలీసుల వివరాల మేరకు.. కణేకల్లు మండలం మాల్యాం గ్రామానికి చెందిన మల్లేష్ కుమారుడు రవికుమార్ (24) జెసిబి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పని నిమిత్తం అతడు తాడిపత్రికి వెళ్లడానికి రైల్లో వెళ్తూ డోర్ వద్ద నిలబడి ఉన్నాడు. దీంతో ప్రమాదవశాత్తు రైల్లో నుంచి కాలు జారి కిందపడటంతో అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



మృతిచెందిన రవికుమార్

చిరుత దాడిలో మేక మృతి



మృతిచెందిన గొర్రెను చూపుతున్న కాపరి తిప్పేస్వామి

గుమ్మగట్ట : మండలంలోని కె.పి.దొడ్డి గ్రామానికి చెందిన బోయ తిప్పేస్వామికి చెందిన మేకపై చిరుత దాడి చేసి చంపింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు...తిప్పేస్వామి తన మేకలను రోజూలాగే మేత కోసం గ్రామ సమీపంలోని కొండ ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఈనేపథ్యంలో ఒక్కసారిగా ఓ చిరుత మేకల మందపై దాడి చేసి ఓ మేకను చంపినట్లు తెలిపారు. దీంతో దాదాపు రూ.10వేలకుపైగా నష్టం వాటిల్లిందని బోరున విలపించాడు. ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందించాలని కోరారు.

జూదరులు అరెస్టు

నార్పల : మండల పరిధిలోని చామలూరు గ్రామం పొలాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి రూ.8,800 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మాట్లాడుతూ మండల ఎక్కడైనా పేకాట, మట్కా, గుట్కా, బెల్టు దుకాణాలు ఏర్పాటు చేస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాంటి వారి పేర్లు కూడా గోప్యంగా ఉంచుతామన్నారు.

జగనన్న హౌసింగ్ లేఅవుట్ల పరిశీలన



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న జెసి కేతన్‌గార్గ్

అనంతపురం సిటీ : అనంతపురం రూరల్ మండలం పరిధిలోని ఆలమూరు గ్రామ హౌసింగ్ లేఔట్‌ను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒక కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకుని ఆ విధంగా కిందిస్థాయి అధికారులకు సూచించి దగ్గర ఉండి పనులను స్పీడ్ అప్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో క్రిమిసంహారక మందు పిచికారీ



డ్రోన్‌ను పరిశీలిస్తున్న రైతులు

బొమ్మనహాల్ : మండలంలోని మిరప పంట సాగు చేసిన జి.మహేశ్వర్‌నాయుడు పొలంలో డ్రోన్ కెమెరా ద్వారా శుక్రవారం క్రిమిసంహారపు ముందు పిచికారి చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ గోపాల్ మాట్లాడుతూ డ్రోన్ కెమారా ద్వారా రోజుకు 50 ఎకరాల్లో పురుగుమందులు పిచికారి చేయవచ్చున్నారు. తద్వారా ఎకరాకు రూ.500 ఖర్చు అవుతుందన్నారు. అవకాశం ఉన్న రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది అవినాష్, వీరాంజనేయులు, వాల్మీకి సంఘం గౌరవాధ్యక్షులు రైతులు, తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పండిందని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి విమర్శించారు. శుక్రవారం నగరంలోని 1వ డివిజన్ ఎర్రనేల కొట్టాల, తదితర కాలనీల్లో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, అదనపు భారాలు, నిరుద్యోగ సమస్య, ఉపాధి తదితర అంశాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ వచ్చిన సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక ప్రజలందరికీ ముప్పు తెచ్చారన్నారు. పేరుకు సంక్షేమ ప్రభుత్వం అంటూ ప్రజల నుంచి దండుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మారుతీ కుమార్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, రాష్ట్ర నాయకులు ఆదినారాయణ, దేవళ్ల మురళి, జిల్లా నాయకులు సరిపూటి రమణ, డిష్ నాగరాజు, నగర అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, గుర్రం నాగభూషణం, తేజస్విణి, శివబాల, సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం పరిశీలన

గార్లదిన్నె : ప్రతి నెలా 9న నిర్వహించే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభయాన్ కార్యక్రమాన్ని జిల్లా ప్రోగ్రాం మేనేజ్మెంట్ అధికారి డాక్టర్ చెన్నకేశవులు, జిల్లా క్షయ, కుష్టు వ్యాధి నివారణ అధికారిణి డాక్టర్ అనుపమ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంతమంది గర్భిణులు వచ్చారు.. వారికి అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. గర్భిణులకు ఐరన్ సుక్రోస్, ఉచిత రక్త పరీక్షలు, ప్రతి గర్భిణికీ ఎంసిపి కార్డు ఇస్తున్నారా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. అలాగే లెప్రసీ సర్వేని త్వరగా పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ షమీంతాజ్, సిహెచ్ఒ, పిహెచ్ఎన్ నాగమ్మ, సూపర్‌వైజర్లు, 73 మంది గర్భవతులు పాల్గొన్నారు.



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు